
- సోషల్ మీడియా వేదికగా ప్రచారాలు
- డివిజన్లలో ఎన్నికల కోలాహలం
- టికెట్ల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు
- డివిజన్ల పునర్విభజనతో కొత్తగా మరికొంతమంది
- రోజు రోజుకు రాజుకుంటున్న ఎన్నికల వేడి

'స్థానిక' సందడి



కరీంనగర్ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బల్దియా ఎన్నికలకు ఇంకా ముహూర్తం ఖరారు కాలేదు. ఎప్పుడు జరుగుతాయో తెలియదు. కానీ నగరంలో పలు డివిజన్లలో అప్పుడే ఎన్నికల కోలాహలం కనిపిస్తోంది. వార్డుల పునర్విభజన ప్రక్రియ పూర్తయింది. ఎన్నికలపై అధికారులకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబరు 30లోగా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ అందుకు అవసరమైన కసరత్తు చేస్తోంది. దీంతో పంచాయతీ ఎన్నికలు ముగిసిన వెంటనే లేదా ఆ తర్వాత కొద్ది రోజులకైనా మున్సిపల్ ఎన్నికలు ఉంటాయని రాజకీయ శ్రేణులు భావిస్తున్నారు. మరికొందరు అక్టోబరు, నవంబరు లేదా ఈ ఏడాది చివరలో తప్పకుండా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని, హైకోర్టు ఈ ఎన్నికలపై జోక్యం చేసుకుంటుందని ఢంకా బజాయించి చెబుతున్నారు. దీంతో ద్వితీయశ్రేణి నాయకులంతా ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. అటు గ్రామాల్లో ఇప్పటికే ఎన్నికల వేడి రాజుకోగా ఇటు మున్సిపాలిటీల్లోనూ ఎన్నికల సందడి మొదలైంది. కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా పోటీ చేయాలనుకునే ఔత్సాహికులంతా అప్పుడే ఎన్నికల రంగంలోకి దిగుతున్నారు.

● సన్నద్ధమవుతున్న ప్రధాన పార్టీలు

కరీంనగర్ కార్పొరేషన్‌లో కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు శివారు గ్రామాలను విలీనం చేసి 66 డివిజన్ల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేయడంతోనే ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌తోపాటు ఎంఐఎం, వామపక్షాలు తమ ద్వితీయశ్రేణి నాయకులకు ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చాయి.ప్రజల్లోకి వెళ్లి కార్పొరేషన్‌పై జెండా ఎగురవేసేందుకు ప్రణాళికలు రచిస్తూ మరోవైపు మాజీ కార్పొరేటర్లు, విలీన కొత్తపల్లి మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డుసభ్యులు, ఎంపీటీసీలు కార్పొరేటర్లుగాపోటీచేసేందుకుప్రయత్నాలు చేస్తున్నారు.

● మళ్లీ అవకాశం ఇవ్వాలంటున్న మాజీలు

మాజీ కార్పొరేటర్లు మరోసారి తమకే అవకాశమిస్తారని భావిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. మరోవైపు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్, మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆఈఆర్ఎస్ మూడు పార్టీలతోపాటు ఎంఐఎం కూడా మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి.

(మిగతా 8వ పేజీలో)


● మారిన డివిజన్ల స్వరూపం

డివిజన్ల స్వరూపం మారడంతో కొత్తగా ఏర్పడిన డివిజన్లలో ఈసారి పోటీ చేస్తే ఎలా ఉంటుందని కొత్తగా బరిలోకి దిగేందుకు ఆలోచిస్తున్నారు. రిజర్వేషన్లు ఎలా ఉంటాయో, డివిజన్లలో రిజర్వేషన్ తమకు అనుకూలంగా ఉంటుందో లేదో, రిజర్వేషన్ల వెల్లడి తర్వాత ఆలోచిస్తామనుకునేవారు కొంతమంది ఉన్నారు. డివిజన్ల ఓటర్లను పరిశీలించి తప్పకుండా రిజర్వేషన్ తమకు అనుకూలంగా వస్తుందనుకునే నాయకులు, కొత్తగా పోటీచేయాలనుకునేవారు అప్పుడే సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని షురూ చేశారు. కొందరు డివిజన్లలో కార్యాలయాలను ఏర్పాటు చేసుకొని ఓటర్లతో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకొని ప్రతిరోజు వారికి గుడ్ మార్నింగ్, పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరికొందరు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో తా ను ఈ డివిజన్ నుంచి పోటీ చేస్తున్నాను, ఆశీర్వ దించడంటూ ప్రచారం చేసుకుంటున్నారు. డివిజన్లలో తిరుగుతూ తనకు అనుకూలంగా ఉందని, పోటీ చే యాలని అందరూ ఒత్తిడి చేస్తున్నారంటూ మీ సహ కారం ఉండాలని కోరుతున్నారు. ఆయా డివిజన్లలోని సమస్యలపై తాను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించానని, తను గెలిపిస్తే అందరికీ అందు బాటులో ఉంటానంటూ హామీలు గుప్పిస్తున్నారు.

ఘనంగా తొలి ఏకాదశి



మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో స్వామివారికి విశేషాలంకరణ

కరీంనగర్ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పలు శైవ, వైష్ణవ ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. చాతుర్మాస్య దీక్షలు ప్రారంభంతో గృహస్తులు, స్వామీజీలు దీక్షా స్వీకారం చేశారు. ఆలయాల్లో అభిషేకాలు, పూజలు, హవనాలు, అలంకారాలు నిర్వహించారు. నదీ స్నానాలు, పుణ్యక్షేత్ర సందర్శనలు, దాన ధర్మాలు, ఉపవాసాలు, జాగరణలు ఆచరిస్తూ ఆధ్యాత్మికతతో గడిపారు. ఇంట్లో పిండి వంటలతో విందులు చేసుకున్నారు. రైతులు ప్రకృతి వైపరీత్యాలు రావద్దని, పంటలకు తెగుళ్లు సోకవద్దని రైతులు ప్రార్థించారు. ఇంటిల్లిపాది సమీప ఆలయాలను సందర్శించి గోత్ర నామాదులతో అర్చన, పూజలు, అభిషేకాలు చేయించుకొని భక్తిభావంతో పరవశించిపోయారు.

నేడు జిల్లాకు మంత్రులు
వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధకశాఖ, క్రీడా, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9:30కు నగరంలోని కరీంనగర్ పాత ఆర్ట్స్ కళాశాల వద్ద పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం 10 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియాన్ని సందర్శించనున్నారు. 10:30 గంటలకు సప్తగిరికాలనీ వాకింగ్ ట్రాక్ వద్ద వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటనున్నారు. 11 గంటలకు ఉజ్వల పార్కు సమీపంలోని చేప పిల్లల పెంపకం కేంద్రాన్ని పరిశీలించి అనంతరం ముదిరాజ్ సంఘాలతో సమావేశం నిర్వహించి ముదిరాజ్ కుల సంఘ భవనాన్ని సందర్శించనున్నారు.

● కరీంనగర్ స్పోర్ట్స్: రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ు జిల్లా కేంద్రం లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయు లతో నూతన క్రీడా పాలసీపై నిర్వహించనున్న సమావేశంలో పాల్గొననున్నారు. క్రీడా పాఠశాలలో నిర్వహించిన నూతన స్విమ్మింగ్ పూల్‌ను వారు ప్రారంభించనున్నారు. వీరితోపాటు శాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి, శాట్ ఎండీ సోనిబాలాదేవి హాజరుకానున్నారని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం మొండయ్య సూచించారు.

శ్యామా ప్రసాద్ ఆశయాలను నెరవేర్చిన మోదీ

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆలోచనలను, ఆశయాలను, ఆకాంక్షలను మోదీ నెరవేర్చారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని నగరంలోని ఎంపీ కార్యాల యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆకాంక్షలకు అనుగుణంగా వాజ్‌పేయి ప్రభుత్వం అణ్వాయుధాలను సమ కూరిస్తే, 370 ఆర్టికల్‌ను రద్దు చేసి శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలను నరేంద్రమోదీ నెరవేర్చారన్నారు. మధ్య దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వ ఫలాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న ప్రభుత్వం నరేంద్రమోదీదే అన్నారు. కార్యక్ర మంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ ఉపాధ్యక్షుడుతాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

కరీంనగర్ రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) యూరియా కొరత ఉందనే పుకార్లు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. కరీంనగర్ రూరల్ మండలంలో రైతులకు ఎలాంటి యూరియా కొరత లేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇటీవల యూరియా కొరత ఉందనే ప్రచారం జరిగింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం సరిపడా యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. కరీంనగర్ మండలంలో వరి నారు మడులు పోసి, వర్షాలు సమృద్ధిగా కురిస్తే నాటుకు సిద్ధంగా ఉన్నారు. మరి కొద్ది రోజుల్లో యూరియాకు డిమాండ్ పెరుగుతుంది. ఆ సమయంలో రైతులు యూరియా కోసం బారులు తీరుతారు.

కరీంనగర్ రూరల్ మండలంలో మొత్తం ఈ సీజన్‌లో 282.585 మెట్రిక్ టన్నులు (6,280 బ్యాగులను) కొనుగోలు చేశారు. ఇందులో ఇప్పటి వరకు 67.095 మెట్రిక్ టన్నులు (1,491) బస్తాలను ఆయా సహకార సంఘాల ద్వారా కేటాయించిన షాపుల ద్వారా అమ్మారు. ఇంకా 215.49 మెట్రిక్ టన్నుల (4,789) బస్తాలు ఆయా కేంద్రాల్లో నిలువ ఉన్నాయి. తీగలగుట్టపల్లి డీసీఎంఎస్‌లో 17.86 మెట్రిక్ టన్నులు, గోపాల్‌పూర్ ఎఫ్‌పీసీ లిమిటెడ్ షాప్‌లో 7.11 మెట్రిక్ టన్నులుగే దుర్శేడ్ వ్యవసాయ సహకార సంఘంలో 57.05 మెట్రిక్ టన్నులు, చెర్లబూత్కూర్‌లో 105.39 మెట్రిక్ టన్నులు, నగునూర్ ఆగ్రోస్‌లో 17.01 మెట్రిక్ టన్నులు చేగుర్తి మంజునాథ ఫెర్టిలైజర్ షాప్‌లో 3.285 మెట్రిక్ టన్నులు, మొగ్దుంపూర్ వరలక్ష్మి ఫెర్టిలైజర్ షాపులో 7.695 మెట్రిక్ టన్నుల యూరియా నిలువ ఉందని అధికారులు తెలిపారు. డిమాండ్ బట్టి ఇండెంట్ పెట్టి రైతులకు సరిపడా యూరియా తీసుకువస్తామని తెలిపారు.



దుర్శేడ్ సహకార సంఘం నుంచి యూరియా బస్తాలను తీసుకెళ్తున్న రైతులు

యూరియా కొరత లేదు...

- బి సత్యం, మండల వ్యవసాయాధికారి

కరీంనగర్ రూరల్ మండలంలో యూరియా కొరత లేదు. ప్రస్తుతం నారు పోసిన రైతులు నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. అప్పటి వరకు డిమాండ్ పెరుగుతుంది. ప్రస్తుతానికి 4,797 యూరియా బస్తాలు ఆయా సంఘాలు, దుకాణాల్లో నిలువ ఉన్నాయి. రైతుల డిమాండ్‌ను బట్టి ఎప్పటికప్పుడు కొరత లేకుండా చూస్తాము.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పిలుస్తోంది..
● అధునాతన భవనం.. ఆధునిక వసతులు
● 400 మంది విద్యార్థులకు అవకాశం
6

దళితుల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి
8
● బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కరీంనగర్ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మొహర్రంను ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీరీలకు పూజలు జరిపి జామామసీదు పక్కన నిలుపగా ముస్లింలతోపాటు హిందువులు పిల్లాపాపలతో హాజరై బత్తీసలు, కుడుకలు, మరమరాల దండలు సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు. మసీదులను, దర్గాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. రాత్రి పొద్దు పోయే వరకు పీరీల దర్శనం కొనసాగింది. జా మా మజీద్ వద్ద ఎంఐఎం నగర సంయుక్త కార్య దర్శి సయ్యద్ ఖమరుద్దీన్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా పార్టీ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ హాజరై షర్బత్ పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమి, పార్టీ నగర కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, సయ్యద్ మొయిజుద్దీన్, ఖాదిరి యూసుఫ్, సయ్యద్ నదీమ్, యూసుఫ్ బాబా, అయూబ్ ఖాన్, అబ్దుల్లా ఖాన్ పాల్గొన్నారు.



పీరీల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న నగరవాసులు



ప్రత్యేక అలంకరణలో పీరీలు

బాలికల భవితకు బంగారు బాట

● కేజీబీవీలో చదువుతోపాటు ఉపాధి కోర్సులు

ఇల్లందకుంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బాగాంధీ విద్యాల యాలు బాలికల చదువుకు చక్కటి మార్గంగా నిలుస్తున్నాయి. ఉచిత వసతి, పుస్తకాలు, దుస్తులు, భోజనం అందించడంతోపాటు ప్రైవేట్ దీటుగా నాణ్య మైన విద్యను అందిస్తున్నాయి. చాలామంది డ్రాపవుట్ విద్యార్థినులు ఈ పాఠశాల్లో చేరి తమ బంగారు భవితకు బాటలు వేసుకుంటు న్నారు. ఈ విద్యాలయాల్లో చదువ ుతోపాటు ఉపాధి కోర్సులు, చిత్రలేఖనం లాంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇల్లందకుంట మండంలోని శ్రీరాములపల్లె గ్రామంలోని కేజీ బీవీ పాఠశాలను విశాలమైన సొంత భవనం ఏర్పాటు చేశారు. ఆరు నుంచి పదో తరగతి వరకు 293 మంది విద్యార్థులు ఉండగా, ఇంటర్ సీఈసీలో 35, ఎంపీహెచ్ డబ్ల్యూ 40మంది విద్యార్థినులు ప్రవేశం పొందారు. వీరందరికి ఇంగ్లీష్‌లో బోధన చేస్తున్నారు.



శ్రీరాములపల్లెలోని కేజీబీవీ పాఠశాల



కుట్టు మిషన్ కుడుతున్న విద్యార్థులు

● సీట్ల వివరాలు...

శ్రీరాములపల్లె కేజీబీవీలో పాఠశాలలో ఆరో తరగతిలో 40, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రెండు గ్రూపుల్లో 80 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లలో విద్యార్థులను చేర్చుకుంటారు. మధ్యలో బడి మానేయడం, అనాథ, పేద బాలికలకు ఇందులో అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉంటుంది.

● ప్రత్యేక కోర్సులు...

కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశానుసారం ఈ పాఠశాలకు ప్రత్యేకంగా క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలిని ఏర్పాటు చేశారు. పాఠశాలలోని ప్రతి విద్యార్థిని ఆర్ట్, కళలు నేర్చుకునే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థినులు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారు. విద్యాలయంలో ఆరు కుట్టు మిషన్లు ఉన్నాయి.

బాలికలకు మంచి అవకాశం

- లావణ్య, కేజీబీవీ ప్రత్యేకాధికారి, శ్రీరాములపల్లె



బాలికల విద్యకు కేజీబీవీ పాఠశాలలు వరం లాంటిది. ఇక్కడ చక్కటి విద్యతోపాటు వసతి, ఇతరాత్ర సౌకర్యాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. దీంతో విద్యకు దూరమయ్యే బాలికల సంఖ్య తగ్గుతుంది. విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధి కోర్సులను అందిస్తున్నాం.

ఎమర్జెన్సీ బాధితులకు పింఛన్లు అందించాలి

శంకరపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఎమర్జెన్సీ బాధితులకు పింఛన్లు అందించాలని భారత సురక్ష సమితి ఆలిండియా వైస్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం శంకరపట్నం మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1975లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి ప్రత్యేక చట్టాలను ప్రవేశపెట్టి తనను ఎదిరించిన వారిని జైలులో పెట్టారన్నారు. ఆనాడు తామంతా నష్టపోయి దుర్భర జీవితం గడపాల్సి వచ్చిందన్నారు. అక్రమ కేసులు బనాయించి ఏళ్లకేళ్లు కోర్టు చుట్టూ తిప్పి, చివరకు నిర్దోషి అని వదిలిపెట్టారన్నారు. నష్టపోయిన దానికి పరిహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు లేదాఅని ప్రశ్నించారు. స్వాతంత్ర సమరయోధులకు పింఛన్ల లాగా ఉత్తరాది రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ పోరాట యోధులకు పింఛన్లు అందిస్తున్నారన్నారు. అదేవిధంగా దక్షిణాది రాష్ట్రాల్లోనూ అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో కృష్ణ, రవీందర్, వీరారెడ్డి, రాజమౌళి, సాయిప్రకాష్, జైపాల్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

చివరి మజిలీకి చింత

- వైకుంఠ ధామాలకు దారిలేక ఇబ్బందులు
- నాలుగేళ్లుగా వాగు ఒడ్డున, సొంత స్థలాల్లోనే దహనాలు
- పట్టించుకోని అధికారులు



దారిలేని హిమ్మత్ నగర్ వైకుంఠధామం

గంగాధర, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో చనిపోయిన వారి అంత్యక్రియలు చేయ డానికి గత ప్రభుత్వం వైకుంఠధామాలను ఏర్పాటు చేసింది. కొన్ని గ్రామాల్లో శ్మశాన వాటికలకు కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కావడం లేదు. గంగాధర మండలంలో 33 గ్రామపంచాయతీలుండగా ప్రతి గ్రామంలో వైకుంఠధామాలను నిర్మించారు. లక్ష్మీదేవిపల్లి, హిమ్మత్‌నగర్ శ్మశాన వాటికలకు దారులు లేక దహన సంస్కారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లక్ష్మీదేవిపల్లిలో వాగు సమీపంలో దారి లేని ప్రాంతంలో నిర్మించారు. వైకుంఠధామం నిర్మిస్తున్న సమయంలో గ్రామస్థులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా అధికారులు అదే ప్రాంతంలో పనులు పూర్తి చేశారు. దహనవాటికలు, గదులు, నిర్మించి వదిలేశారు. దారి లేకపోవడంతో నాలుగేళ్లుగా నిరూపయోగంగా ఉంది. శ్మశాన వాటికకు నీటి సౌకర్యం, లైటింగ్, సీసీ రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. హిమ్మత్‌నగర్‌లో వాగు పక్కన వైకుంఠదామాన్ని నిర్మించారు. రోడ్డు పక్క నుండి వాగు వెల్లుతుండగా అధికారులు రెండు సిమెంటు పైపులను వేసి దారి నిర్మించారు. నాలుగేళ్ల క్రితం భారీ వరద రావడంతో పైపులు కొట్టుకు పోయి దారి లేకుండా పోయింది. దీంతో సంవత్సరాల తరబడి లక్షలు ఖర్చు చేసి నిర్మించిన వైకుంఠ ధామం నిరూపయోగంగా మారింది. ఈ గ్రామాల్లో సొంత స్థలం ఉన్న వారు వారి పొలాల్లో, గుంట భూమిలేని వారు వాగులు, చెరువుల గట్లపై దహనసంస్కారాలు నిర్వహిస్తున్నారు. వర్షకాలంలో ఎవ్వరైనా చనిపోతే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నారాయణపూర్ శ్మశాన వాటికలో నిర్మించిన గదుల రేకులు లేచిపోయాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పట్టించుకుని ఆయా గ్రామాల్లో నెలకొన్న వైకుంఠధామాల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో గదులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఓదెల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోత్కపల్లి యూనియన్ బ్యాంక్ వద్ద ఆదివారం రెండు వాహనాలు ఢీకొన్న సంఘటనలో గుంపులకు చెందిన ఆరేపల్లి జశ్వంత్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోత్కపల్లి నుంచి ద్విచక్రవాహనంపై గుంపుల వైపు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో జశ్వంత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. దీంతో క్షతగాత్రుడిని జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు.

పొరండ్లలో ఆర్ఎంపీ క్లినిక్ తనిఖీ

తిమ్మాపూర్ (మానకొండూర్), జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలంలోని పొరండ్ల గ్రామంలో గల ఆర్ఎంపీ వైద్య క్లీనిక్‌ను టీజీఎంసీ సభ్యుడు యగ్గన్న శ్రీనివాస్ ఆదివారం తనిఖీ నిర్వహించారు. రోగులకు యాంటీబయాటిక్ ఇంజక్షన్‌లు, స్టెరాయిడ్, ఇంజక్షన్‌లు పేయిన్ కిల్లర్ ఇంజక్షన్‌లు ఇస్తున్నట్లు తనిఖీలో గుర్తించారు. దీనికి అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులో ఫార్మసిస్ట్ లేకుండా ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇస్తున్నట్లు గుర్తించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

పేకాట రాయుళ్లపై కేసు

కరీంనగర్ క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వారి వద్ద 9,320 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని, పోలీస్ స్టేషన్‌కు తరలించి నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.



చొప్పదండిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పిలుస్తోంది..

- అధునాతన భవనం..
- ఆధునిక వసతులు
- 400 మంది విద్యార్థులకు అవకాశం

చొప్పదండి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులను పిలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో సహా ఓసీ వర్గాలకు చెందిన మూడో తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఈ హాస్టల్‌లో ప్రవేశం కల్పిస్తారు. 400 మంది విద్యార్థుల కోసం అధునాతనమైన భవనాన్ని ఐదేళ్ల క్రితం నిర్మించగా, విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పట్టణం నడిఒడ్డున ఉండి అందరికి అందుబాటులో ఉంది. ప్రస్తుతం హాస్టల్‌లో 200 మంది విద్యార్థులు ఉండగా మరో 200 ఖాళీలు ఉన్నాయి.



యోగా చేస్తున్న విద్యార్థులు



భోజనశాలలో విద్యార్థులు

● విద్యార్థులకు పోషకాహారం...

హాస్టల్‌లో విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. వారానికి రెండుసార్లు చికెన్, రోజు ఎగ్‌తోపాటు అరటిపండు, ఉదయం రాగిజావను అందిస్తున్నారు. ఉదయం అల్పాహారంలో పూరి, ఇడ్లీ, ఉప్మా, పొంగలి, కిచిడిని ఇస్తున్నారు. సాయంత్రం స్నాక్స్ అందిస్తుండగా, విద్యార్థులకు స్వెటర్లు, దుప్పట్లు, బ్యాంకెట్లను అందిస్తున్నారు. స్నానానికి వేడినీటి సౌకర్య ఉండగా, తాగడానికి మినరల్ వాటర్ ప్లాంట్‌ను హాస్టల్‌లో నెలకొల్పారు. హాస్టల్ ఆవరణలో విద్యార్థులకు క్రీడా మైదానం ఉండగా ప్రతిరోజు వ్యాయాయం చేయిస్తుంటారు. ఇద్దరు వార్డెన్లతోసహా ఒక అధికారి పర్యవేక్షణలో ఈ హాస్టల్ నడుస్తోంది.



విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి...

– సత్యనారాయణ, హాస్టల్ వార్డెన్



తమ హాస్టల్‌లో అన్ని వసతులను విద్యార్థులకు కల్పిస్తున్నాం. విద్యార్థులు హాస్టల్‌లో చేరి ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. వదశాతం ఉత్తీర్ణత శాతం సాధించేందుకు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



పోషయ్య(ఫైల్)

వీర్నపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించలేక, అనారోగ్యంతో ఉన్న కూతురికి వైద్యం చేయించలేక ఉరేసుకొని ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి పోషయ్య (60) కూలీ పనితోపాటు కొంత తనకున్న ఎకరంన్నర భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూతురు తిరుమల(25) చిన్నతనం నుంచి షుగర్ వ్యాధితో బాధపడుతోంది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో సుమారు ఐదు లక్షల రూపాయల వరకు అప్పులయ్యాయి.

కూతురు ఆరోగ్యం కుదుటపడకపోవడం, ఆసుపత్రుల్లో చూపించేందుకు డబ్బుల్లేక తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం గ్రామశివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య రాజవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనారోగ్యంతో ఉన్న బిడ్డ కన్నీరు పెడుతూ తండ్రి చితికి నిప్పు పెట్టడం పలువురిని కలిచివేసింది.

పురుగుల మందు తాగి యువకుడు..

ముత్తారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడివిశ్రీరాంపూర్‌కు చెందిన చొప్పరి సదానందం (35) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సదానందం తాగుడుకు బానిసై ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. శనివారం ఉదయం బయటకు వెళ్తున్నానని చెప్పి సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో భార్య చొప్పరి భారతితోపాటు కుటుంబసభ్యులు గ్రామంలో వెతుకగా ఊర చెరువు దగ్గర తాగిన మత్తులో పురుగుల మందు కిందపడిపోయి ఉన్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు సదానందం భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో తాటిచెట్టు పైనుంచి పడి వెంగలి శంకరయ్య అనే గీతకార్మికుడికి ఆదివారం గాయాలయ్యాయి. వెంగలి శంకరయ్య కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కుతుండగా మోకుజారి కింద పడిపోయాడు. కార్మికులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని గీత కార్మికుడి దుర్మరణం



ఐలు మల్లేష్ (ఫైల్)

ఓదెల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఐలు మల్లేష్ (36) అనే గీత కార్మికుడు బెల్లంపల్లిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఓదెలకు చెందిన మల్లేష్ మూడు సంవత్సరాల క్రితం బెల్లంపల్లి మండలం కాసిపల్లికి గౌడ వృత్తి చేసేందుకు వలస వెళ్లాడు. శనివారం రాత్రి బెల్లంపల్లిలో మిత్రుడి శుభకార్యానికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మృతుడికి భార్య రాధిక, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మల్లేష్ మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. మల్లేశం నేత్రాలను సదాశయ ఫౌండేషన్ సేకరించారు. ఓదెలలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

పొలానికి దారి కోసం గొడవ

- ఒకరిపై దాడి..తీవ్రగాయాలు
- చికిత్స కోసం ఆసుపత్రికి తరలింపు

కథలాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పొలానికి దారి కోసం జరిగిన గొడవలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం కథలాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం... తిక్క మల్లేశ్ అనే రైతుకు పక్కనే ఉన్న తిక్క రాహుల్‌కు కొంతకాలంగా దారి కోసం గొడవ జరుగుతోంది. మల్లేశ్ ట్రాక్టర్‌పై వెళ్లి దున్ని ఇంటికి వస్తున్న క్రమంలో రాహుల్, ఆదిత్య పారతో కొట్టగా తీవ్రగాయాలయ్యాయి. తలనుంచి రక్తస్రావం కావడంతో మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కోరుట్లకు పంపించారు. దాడికి పాల్పడ్డ రాహుల్, ఆదిత్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. నిందితులు పరారీలో ఉన్నట్టు చెప్పారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూరు గ్రామ శివారులో ప్రధాన రహదారి వద్దగల వైన్స్ సమీపంలో కామారెడ్డి వైపు వెళుతున్న టిఎస్03ఇజె1008 అనే కారు సిరిసిల్ల వైపు వస్తున్న ద్విచక్రవాహన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న సిరిసిల్ల పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన బరిగెల అరుణ్‌కుమార్(29), నెహ్రూనగర్‌కు చెందిన తడుక సాయిచరణ్ (27)లకు తీవ్రగాయాలయ్యాయి. బరిగెల అరుణ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. సంఘటనా స్థలానికి టౌన్ సీఐ కృష్ణ వెళ్లి రహదారిపై ఉన్న వాహనాలను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

స్కూటీని ఢీకొట్టిన లారీ: ఇద్దరికి గాయాలు

కొడిమ్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న కొడిమ్యాల మండలంలోని తురుకకాశీనగర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని సండ్రల్లపల్లి గ్రామానికి చెందిన బుచ్చిబాబు అతనికి వరుసకు కుమారుడైన చంద్రగిరికి చెందిన జూపాక మారుతి వర్షిత్ నమిలికొండ నుంచి గంగాధరకు పనినిమిత్తం స్కూటీపై వెల్లుతుండగా లారీ ఢీకొట్టగా ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. గాయాలాపాలైన ఇద్దరిని 108వాహనంలో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికుడు సునీల్ విశ్వకర్మ(31) శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. సునీల్ విశ్వకర్మ చైతన్యపురి కాలనీలో ఒక భవనం నిర్మాణ పనుల్లో స్లాబ్ కోసం ఇనుక సలాకలను మిషన్‌తో కట్ చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగిపోయి సునీల్ ప్రమాదానికి గురయ్యాడు. అక్కడే ఉన్న ఇంటి యజమాని, తోటి కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. సునీల్ విశ్వకర్మ భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవులు పట్టివేత

ధర్మపురి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం చెక్ పోస్ట్ వద్ద ఆదివారం మధ్యాహ్నం వెహికల్ తనఖీ చేస్తున్న సమయంలో ఒక పికప్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకొన్నట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం వేళలో వాహనాన్ని తనఖీ చేశామన్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి వాహనంలోని ఎనిమిది ఆవులు, రెండు లేగ దూడలను గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నారి హత్య కేసులో వీడుతున్న మిస్టరీ

- చిన్నమ్మపైనే అనుమానం
- పోలీసుల అదుపులో అనుమానితురాలు



చిన్నారి మృతదేహంపై పడి విలపిస్తున్న తండ్రి రామ్, ఇన్‌సెట్‌లో హితీక్ష (ఫైల్)

కోరుట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్‌లో శనివారం జరిగిన హితీక్ష(5) అనే చిన్నారి హత్య కేసు మిస్టరీ వీడుతోంది. ఈ కేసులో పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. పోలీసులు విచారణ చేపట్టి ఆమె చిన్నమ్మ మమత పైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి హితీక్ష మమతకు తోటి కోడలు కూతురు. హత్య జరిగిన వెంటనే ఎస్పీ అశోక్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మొదట హితీక్ష మృతదేహం దొరికిన ఇంటి యజమాని విజయ్ వివరాలను సేకరించగా అతడు వరంగల్ జిల్లాలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విజయ్‌ని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టిన పోలీసులు ఆదివారం విడిచి పెట్టారు. సంఘటనా స్థలం దగ్గర పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టగా అవి హితీక్ష ఇంటిలోకి వెళ్లి నిలిచి పోవడంతో పోలీసులు ఆ కోణంలో విచారణ చేపట్టారు. ఇంట్లో ఉన్నవారి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఇంట్లోకు వచ్చి పోయేవారి వివరాలతో పాటు హితీక్ష చిన్నమ్మ మమత ఫోన్ డేటాను పరిశీలించారు.

● వివాదాస్పదంగా మమత వ్యవహారం

మమత సెల్‌ఫోన్‌లో హత్య చేయడానికి సంబంధించిన కొన్ని వీడియో క్లిప్పింగులను గుర్తించి న పోలీసులు ఆ కోణంలో విచారణ చేపట్టారు. తొలుత మమత ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు కొద్దిసేపటి అనంతరం తిరిగి అందించారు. మరికాసేపటికి మమత ఫోన్‌ను తీసుకొని తనిఖీ చేయగా అందులో మమత డౌన్‌లోడ్ చేసిన వీడియోలు లేకపోవడంతో ఆమెపై అనుమానం వ్యక్తం చేసి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. హత్య జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించగా మమత సాయంత్రం 6:30 గంటల నుంచి మృతదేహం దొరికే వరకు ఐదుసార్లు అదే ప్రాంతానికి వచ్చిపోయినట్లు పోలీసులు గుర్తించారు. సంఘటన సమయంలో మమత వేసుకున్న లెగ్గిన్, హితీక్షను ఆసుప్రతికి తీసుకువచ్చిన సమయంలో ధరించిన లెగ్గిన్ వేరుగా ఉండడంతో పోలీసులు మరింత లోతుగా విచారణ చేపట్టారు. హితీక్ష కోసం బంధువులు వెతుకుతున్న సమయంలో మమత పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ వైపు వెళ్లి వచ్చినట్లుగా తెలుస్తోంది. చిన్నారి హత్య కోసం వాడిన పరికరాలతో పాటు మమత వేసుకున్న లెగ్గిన్‌ను పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద పడేసినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఈ కేసులో మమతతో పాటు ఎవరైనా ఉన్నారా అన్న విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

● ఆన్‌లైన్ బెట్టింగుల్లో రూ.25లక్షల నష్టం

పట్టణంలోని ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన ఆకుల మదన్-లక్ష్మి దంపతులకు రామ్, లక్ష్మణ్ అనే ఇద్దరు కవల కుమారులు, ఓ కూతురు ఉంది. మదన్ తన ఇద్దరు కుమారులు రామ్, లక్ష్మణ్‌లకు ఎనిమిది సంవత్సరాల క్రితం నవీన, మమతలతో ఒకే వేదికపై వివాహం జరిపారు. రామ్, లక్ష్మణ్‌లు తండ్రి మదన్‌తో కలిసి గల్ఫ్ దేశానికి ఉపాధి నిమిత్తం వెళ్లి వస్తుంటారు. రామ్-నవీన దంపతులకు కుమారుడు వేదాక్ష్, కూతురు హితీక్ష ఉన్నారు. లక్ష్మణ్-మమత దంపతులకు శ్రీహశ్రీ, మహనీయ అనే ఇద్దరు కూతుర్లు ఉన్నారు. రామ్, లక్ష్మణ్, తండ్రి మదన్ గల్ఫ్ దేశానికి వెళ్లగా నవీన, మమత వారి అత్త లక్ష్మితో కలిసి ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఎంబీఏ పూర్తి చేసిన మమత కోరుట్లలోని కంప్యూటర్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తోంది. మమత ఆన్‌లైన్ బెట్టింగులతో పాటు బిట్ కాయిన్‌లో పెట్టుబడి పెట్టి 25 లక్షల రూపాయలు నష్టపోయినట్లు తెలిసింది. డబ్బులు పోగొట్టుకోవడంతో పాటు ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారని మమత తన తోటి కోడలు నవీనపై కక్ష పెంచుకొని ఆమె కూతురు హితీక్షను హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

గల్ఫ్ నుంచి వచ్చిన చిన్నారి తండ్రి

కోరుట్ల (ఆంధ్రజ్యోతి): కూతురు హత్యకు గురైన విషయం తెలుసుకున్న హితీక్ష తండ్రి రామ్, తాత మదన్ గల్ఫ్ దేశ నుంచి ఆదివారం కోరుట్ల పట్టణానికి చేరుకున్నారు. హితీక్ష మృతదేహంపై పడి తల్లిదండ్రులు రామ్-నవీన రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అనంతరం హితీక్ష అంత్యక్రియలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు, కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు సురేష్ బాబు, అనిల్ కుమార్, ఎస్ఐలు చిరంజీవి, కిరణ్ కుమార్, నవీన్, శ్యాంరాజు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

కేసు రాజీ చేసుకోవాలని బెదిరింపులు

-ఒకరి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నం చేసిన రాములు

ధర్మారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయం లో రాజీ చేసుకోవా లని పెద్ద మనుషుల తో పాటు ఎస్ఐ బెదిరింపు లకు పాల్పడుతున్నారని ఓ వ్యక్తి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండ లం నందిమేడారం గ్రామానికి చెందిన కొండ రాములు గౌడ్ (50) కుమారుడు కొండ సాగర్ ఓ ప్రేమ వ్యవహారంలో నాలుగు సంవత్సరాల క్రితం హత్యకు గురయ్యాడు. దానికి సంబంధించిన కేసు పెద్దపల్లి జిల్లా కోర్టులో ఉండగా ఇటీవల ట్రయల్‌కు వచ్చింది. ఈ నేపథ్యంలో హత్యకు గురైన వ్యకి కుటుంబ సభ్యులను కేసును రాజీ చేసుకోవాలని గ్రామానికి చెందిన ముగ్గురు పెద్ద మనుషులు ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో కొండ రాములు గౌడ్ ధర్మారం ఎస్ఐ శీలం లక్ష్మణ్‌కు శనివారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ పెద్ద మనుషులకే వత్తాసుపలికి రాములు పైనే కేసు పెడతానని బెదిరించాడని రాములుగౌడ్ కుమారుడు హరీష్ చెప్పాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రాములు గౌడ్ డయల్ 100కు ఫోన్ చేసి ఎస్ఐ కేసు పెడుతానని బెదిరిస్తున్నాడని, తాను పురుగుల మందు తాగుతున్నానని చెప్పి పురుగుల మందు తాగాడు. సమాచారం అందుకున్న పోలీసులు కొండ రాములు ఇంటికి వెళ్లి కొడుకు హరీష్ సహాయంతో ఘటన స్థలానికి చేరుకొని రాములును చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● రూ.22 లక్షలే

ఆత్మహత్యాయత్నానికి కారణమా?

కేసు రాజీ చేసుకోవాలని పెద్ద మనుషుల సమక్షంలో 22 లక్షల రూపాయలకు ఒప్పందం చేసుకొన్న కొండ రాములు అకౌంట్లో డబ్బులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్ రాసుకున్నట్లు తెలిసింది. కేసు ట్రయల్‌కు వస్తున్న నేపథ్యంలో కొండ రాములు రాజీకి ఒప్పుకోవడం లేదని, 22 లక్షల రూపాయలు తిరిగి ఇవ్వాలని పెద్దమనుషులు ఒత్తిడి తెచ్చినట్లు తెలుసింది. ఈ విషయమై ఎస్ఐ లక్ష్మణ్‌ను వివరణ కోరగా పెద్ద మనుషులు తనను బెదిరిస్తున్నారని, తనకు సహాయం చేయాలని రాములు తనకు ఫిర్యాదు చేశాడన్నారు. నాలుగు సంవత్సరాలుగా కోర్టులో కేసు నడుస్తుండగా తాను అందులో జోక్యం చేసుకోలేనని రాములుకు నచ్చజెప్పానే తప్ప ఎలాంటి బెదిరింపులకు పాల్పడలేదని తెలిపారు.

కాల్వ నర్సయ్య ఆశయ సాధనకు ఉద్యమిద్దాం



చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

భగత్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక నేత కాల్వ నర్సయ్య యాదవ్ ఆశయ సాధనకు ఉద్యమించాలని సీపీఐ నాయకులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అన్నారు. ఆదివారం కార్మిక నేత ప్రజా ఉద్యమాల నాయకుడు కాల్వ నర్సయ్య ఆరో వర్ధంతి సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్వ నరసయ్య యాదవ్ కార్మికుల కోసం జీవితాన్ని అంకితం చేశారన్నారు. కాల్వ నర్సయ్య యాదవ్ ఆశించిన ఆశయాల కోసం ప్రతి ఒక్క కమ్యూనిస్టు కార్యకర్త పని చేయాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు జంగా తిరుపతి యాదవ్, జంగ కొమురయ్య యాదవ్ దానవేణి రమేష్ యాదవ్ గామినేని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు ఇచ్చేదెన్నడో?

- నాలుగేళ్లుగా ఎదురుచూపులు
- ప్రభుత్వం స్పందించాలంటున్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు

మల్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): డబుల్‌బెడ్ రూం ఇళ్లు అందించిన అధికారులు వాటికి సంబంధించిన పట్టాలు అందించకపోవడంతో లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మల్యాల మండలం నూకపల్లి, పోతారం, రామన్నపేట గ్రామంలో ఇళ్లలేని నిరుపేదల కోసం నూకపల్లి శివారులో గత ప్రభుత్వ హయాంలో 65 మందికి డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. ఆ ఇళ్లను 2021 అక్టోబరు 14న అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు ఇళ్లు అందజేశారు. అప్పటి నుంచి ఇళ్లకు పట్టాలు లేక ఇంటి నంబర్లు కేటాయించడం లేదు. దీంతో 65 ఇళ్లకు సంబంధించి సీరియల్ నంబర్లపైనే ఇంటి పన్నులు చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నాలుగు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఇంటి పట్టాలు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పలు సౌకర్యాలు అందుకో లేకపోతున్నామని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇంటి పట్టాలు ఇస్తే వాటి ద్వారా ఇంటి పన్నులు చెల్లించడం, ఇతరత్రా సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు.

● పట్టాలు ఇవ్వాలి

స్వప్న, లబ్ధిదారు



ఇళ్లు అందించి నాలుగు సంవత్సరాలు అవుతున్నప్పటికీ పట్టాలు ఇవ్వడం లేదు. దీంతో తాము నష్టపోవాల్సి వస్తోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన్నప్పటికీ చర్యలు తీసుకోవడంలేదు. వెంటనే తమకు అందించిన ఇళ్లకు పట్టాలు అందించాలి.

● ఇంటి పన్నులు చెల్లిస్తున్నాం

కాసారపు పద్మ, లబ్ధిదారు



ఇంటి నంబర్లు లేకున్నా మాకు కేటాయించిన ఇళ్ల సీరియల్ నంబర్ ఆధారంగా ఇంటిపన్నులు చెల్లించాల్సి వస్తోంది. తమకు పట్టాలు ఇప్పించి ఇళ్లకు నంబర్లు కేటాయించాలి.

వైభవంగా బోనాల ఉత్సవాలు



చిన్న మెట్‌పల్లిలో బోనాల శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

హుజూరాబాద్/జమ్మికుంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, జగిత్యాల జిల్లాలో ఆదివారం బోనాల సందడి నెలకొంది. హుజూరాబాద్ పట్టణంలోని యాదవ్ నగర్ నుంచి గొల్ల కురుమలు, జమ్మికుంట పట్టణంలోని అబాది జమ్మికుంటలో కురమ, గొల్లలు బీరప్ప బోనాలను వైభవంగా నిర్వహించారు. పురవీధులు గుండా, డప్పు చప్పుళ్లతో బీరప్ప దేవాలయం చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు బాగుండేలా మమ్మల్ని చల్లగా చూడాలని దేవుడిని వేడుకుంటామని కులపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో కులస్థులు, పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆదివారం మహాలక్ష్మి దేవతకు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు నెత్తిన బోనాలను పెట్టుకొని శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్ర గ్రామం నుంచి గ్రామ శివారులోని మహాలక్ష్మి దేవాలయం వరకు జరిగింది. అనంతరం మహాలక్ష్మి దేవతకు మహిళలు బోనాలను సమర్పించగా పోతరాజులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో వనభోజనాలు జరిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో ఆదివారం పోచమ్మ బోనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామశివారులో కొలువైన అమ్మవారి సన్నిధిలో గ్రామస్థులు ఉదయం నుంచి పూజలు చేశారు. ఇంటికొకరు చొప్పున మహిళలు బోనాలు తీసి పుర వీధుల వెంట డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో నైవేద్యం సమర్పించారు. పోతురాజులు చేసిన విన్యాసాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు. బోనాలు చూసేందుకు దుంపెట, భూషణరావుపేట గ్రామాల నుంచి తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బైర హేమలతమల్లేశ్, మహేశ్, నర్సారెడ్డి, గంగారెడ్డి, వివిధ కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

- ప్రాజెక్టులోకి 6,090 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరద నీరు కొనసాగింది. డ్యామ్‌లోకి 6,090 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 80.5 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 18.443 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 11.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 654 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 7.590 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 1.934 టీఎంసీల నీటిని వ్యయం చేశారు.

గంగనాల ఆయకట్టు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములకుర్తి గ్రామం గోదావరి నది తీరంపై ఉన్న గంగనాల ఆయకట్టు నీటిని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విడుదల చేశారు. అంతకు ముందు గోదావరి నదికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ ఆయకట్టు కింద మండలంలోని వేములకుర్తి, యామాపూర్, ఫకీర్ కొండాపూర్, మల్లాపూర్ మండలంలోని నడికుట, మొగిలిపేట్, ఓబులాపూర్, సంగం శ్రీరాంపూర్, దామరాజ్‌పల్లి గ్రామాల్లో సుమారుగా నాలుగువేల ఎకరాలకు తాగునీరు అందుతుందని వివరించారు. రైతులు రెండు పంటలు సాగు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుమ్మల గంగన్న, యామాపూర్ పీఏసీఎస్ చైర్మన్ అంకతి రాజన్న, నాయకులు దేశెట్టి రాజారెడ్డి, నాంపల్లి వెంకటాద్రి, బుర్రిముత్యం, అశోక్, కళ్ళెడ నరేందర్ తోకల సత్తయ్య పాల్గొన్నారు.

తండాల్లో 'శీత్లాభవాని' సందడి



నైవేద్యంపై దాటుతున్న పశువులు (ఫైల్)



మొక్కులు చెల్లించుకుంటున్న గిరిజనులు (ఫైల్)

- పశువుల క్షేమం కోసం గిరిజనుల పూజలు
- అమ్మ అనుగ్రహంతో రోగాలు తొలగుతాయని నమ్మకం
- రేపు తండాల్లో వేడుకలు

రుద్రంగి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : లంబాడీల ఆరాధ్యదైవం శీత్లాదేవి. ఆషాఢం వచ్చిందంటే గిరిజన తండాల్లో పండగ వాతవరణంతో సందడి నెలకొంటుంది. తండా పెద్దమనిషి అనుమతితో ఆషాఢంలో ఒక మంగళవారాన్ని ఈ పండుగ జరుపుకోవడానికి కేటాయిస్తారు. ఈ పండుగ చేయడం ద్వారా దేవి అనుగ్రహిస్తే పశుసంపద అభివృద్ధితో పాటు ప్రజలకు వ్యాధులు రావని లంబాడీల నమ్మకం. తెలంగాణలో పోచమ్మ బోనాల పండుగా మాదిరిగానే గిరిజనులు శీత్లాభవాని వేడుకలు జరుపుకుంటారు. గతంలో గిరిజనుల జీవన ఆధారం పశు సంపద. గిరిజనులు నిత్యం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడానికి పశుసంపదన ఉపయోగించుకునేవారు. పశుసంపద అభివృద్ధి కోసం గిరిజనులు శీత్లా భవాని దేవిని పూజిస్తారు. రుద్రంగి మండలం చుట్టూ ఉన్న గిరిజన తండాల్లో మంగళవారం శీత్లాభవాని పండుగను ఘనంగా నిర్వహించేందుకు ముస్తాబు చేస్తున్నారు. లంబాడీలు ఆషాఢ మాసంలో తండా పెద్ద మనుషుల అనుమతితో ఈ పండగను నిర్వహిస్తారు. గతంలో ఈ పండుగను కేవలం పశువులు ఉన్నవారే చేసేవారు. కానీ ఇప్పుడు అన్ని తండాల్లో గిరిజనులు నిర్వహించుకుంటున్నారు.

● ఆకట్టుకునే పూజా విధానం

పెద్ద పుష్యమి కార్తెలో శీత్లా మాతకు పూజిస్తారు. తండాలోని ఇళ్లలో కాకుండా దగ్గరలో ఉండే ఓ ఖాళీ ప్రదేశంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పొడవాటి రాళ్లతో తయారుచేసిన ప్రతిమలను ఏడుగురు భవానీలను వరుసలో తూర్పు దిక్కున ప్రతిష్ఠిస్తారు. భవానీల ప్రతిమలకు ఎదురుగా కొద్ది దూరంలో లుంకాడియా ప్రతిమను భవానీల వైపు చూసేలా నెలకొల్పుతారు.

● యువతులతో నైవేద్యం..



నైవేద్యం తీసుకొచ్చిన యువతులు(ఫైల్)

శీత్లా భవాని ప్రతిమలకు జాజు పూసి పువ్వులు, మామిడి ఆకులతో అలంకరిస్తారు. ఒక్కరోజు ముందు జొన్నలు, పప్పుధాన్యాలు కలిపి తయారుచేసిన గుగ్రిని తెల్లవారు జరిగే శీత్లా పండుగకు నైవేద్యంగా తీసుకెళ్తారు. దీనినే వాంసీడొ నైవేధ్యాన్ని యువతులు శీత్లా భవాని అమ్మవారికి సమర్పిస్తారు. శీత్లా భవాని మాతకు ఇళ్ల నుంచి తీసుకువచ్చిన పాయసం పూజలో ఉంచుతారు. వాంసీడొ నైవేధ్యాన్ని అన్ని పశువులపై పడేలా చల్లుతారు. దీని వల్ల పశుసంపద పెరుగుతుందని, పశువులకు ఎలాంటి వ్యాధులు రావని వారి నమ్మకం.

తెలుగు వెలుగు జాతీయ పురస్కారానికి ఎంపిక

- ఈ నెల 12న మహానంది అవార్డుల ప్రదానం



మల్లేశం, సంతోష్‌చారి

గంభీరావుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలంలో ఒకరు సేంద్రియ వ్యవసాయంలో, మరొకరు శిల్పకళలో రాణి స్తూ తెలుగు వెలుగు జాతీయ పురస్కారానికి ఎంపిక య్యారు. వీరిద్దరి నైపుణ్యా లను గుర్తించిన తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ మహానంది అవార్డుకు ఎంపిక చేసింది. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బొంగు మల్లేశం అనే యువ రైతు సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాడు. ఐదేళ్లుగా ఆధునిక పద్ధతుల్లో సేంద్రియ వ్యవసాయ రంగంలో రాణిస్తు అందరి మన్ననలు పొందుతున్నాడు. దాదాపు 20 రకాల కూరగాయలను సాగు చేయడంతో పాటు జామ తోట పంటను పండించాడు. మండల కేంద్రానికి చెందిన వడ్రంగి చేపూరి సంతోష్‌చారీ అనే యువకుడు శిల్పకళా రంగంలో రాణిస్తున్నాడు. వండ్రంగి సంతోష్‌చారి తన కళా నైపుణ్యంతో మహనీయుల చిత్రాలు చెక్కాడు. బాబాసాహెబ్ అంబేడ్కర్, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ చిత్రాలతో పాటు అనేక రకాల వస్తువులను తన శిల్పకళతో చెక్కి సంతోష్‌చారి వార్తల్లోకి ఎక్కాడు. కాళోజీ తెలుగు బక్ ఆఫ్ రికార్డ్సు, తెలగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 12న హైదరాబాద్ త్యాగరాయ గాన సభ వేదికలో వీరిద్దరికి మహానంది పురస్కారం ప్రదానం చేయనున్నారు. వీరిద్దరు నంది అవార్డుకు ఎంపిక కావడం పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల సందడి

- తొలి ఏకాదశి సందర్భంగా తరలివచ్చిన భక్తజనం
- స్వామివారికి ప్రత్యేక పూజలు, అఖండ భజన

వేములవాడ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. అనంతరం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించకుని ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు.

● తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు..

రాజన్న ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి, పరివార దేవతలకు అభిషేకపూజ, అర్చనలు చేశారు. రుక్మిణి విఠలేశ్వర స్వామివారికి పంచోపనిషత్ ద్వారా అభిషేకం నిర్వహించి సాయంత్రం మహాపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత పూజ వరకు అర్చకులు, భక్తులు అఖండ పూజలో పాల్గొన్నారు.

● స్వామివారి సేవలో ప్రభుత్వ విప్..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఏఈవో శ్రీనివాస్ ప్రసాదాన్ని అందజేశారు.

ధర్మపురిలో..

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు లక్ష్మీ నరసింహస్వామి, వేంకటేశ్వర స్వామి వారలకు అభిషేకం, పంచోపనిషత్తులతో మహా క్షీరాభిషేకం, తులసీ అర్చన, విశేష పూజా, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే యాగశాల వద్ద నారసింహ హవనం, స్వామి వారల నిత్య కల్యాణం నిర్వహించారు. భక్తులు ఉదయంనుంచి రాత్రి వరకు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, నంబి శ్రీనివాసాచారి, నరసింహమూర్తి, రమణాచార్యా, అభిషేక్ పౌరోహితులు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.





రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు, ధర్మపురిలో యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

● గోదావరి నదిలో పుణ్య స్నానాలు

తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ధర్మపురి గోదావరి నదిలో ఆదివారం భక్తులు స్నానాలు ఆచరించారు. ఉదయం భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. నది వద్ద సైకత లింగాలు చేసి పసుపు, కుంకుమ చల్లి, కొబ్బెరికాయలు కొట్టి పూజించారు.

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూజలు

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం సందర్శించారు. తొలి ఏకాదశి పురస్కరించుకుని ఆలయానికి విచ్చేసిన మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు ఆలయం వద్ద ఆయనకు వేదపండితులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వదించగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్ర, ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ఆయన స్థానిక రామలింగేశ్వర స్వామి, గణపతి, రావి చెట్టు ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆయన టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ధర్మకర్తల మండలి సభ్యులు ఉన్నారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, ఉమాసాగర్, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.

సీసీ రోడ్డు నిర్మాణం.. విద్యార్థులకు తప్పిన తిప్పలు





గతంలో బురదమయంగా మారిన మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాల రహదారి, నిర్మాణం అవుతున్న సీసీ రోడ్డు

కోనరావుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శరవేగంగా సీసీ, తారు రోడ్డు నిర్మాణం పనులు జరుగుతుండడంతో రెండు జిల్లాల వాసులకు కష్టాలు తప్పాయి. ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల నుంచి సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరగడంతో విద్యార్థులకు, అధ్యాపకులకు, ప్రజాప్రతినిధులకు తిప్పలు తప్పాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల నుంచి నిజామాబాద్ జిల్లాలను కలిపే ప్రధాన రహదారి రోడ్డు పనులు మరిమడ్ల నుంచి మానాల వరకు చురుగ్గా కొనసాగుతున్నాయి. దీంతో రెండు జిల్లాల వాసులకు కష్టాలు తప్పాయి. మరిమడ్ల గ్రామ శివారులో ఉన్న ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలకు గతంలో గుంతలు, బురదమయంగా రహదారి ఉండేది. అటుగా వెళ్లాలంటే విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు భయంగా వెళ్లేవారు. మరిమడ్ల నుంచి మానాల వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల ప్రధాన రహదారికి ఆరు కోట్ల రూపాయలను ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. మరిమడ్ల శివారులో ఉన్న ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల సుమారు ఒక కిలోమీటర్‌నర ఉంటుంది. సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో విద్యార్థులకు కష్టాలు తప్పాయి. మరిమడ్ల శివారు నుంచి ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల పక్కనుంచి మానాల వరకు తారు రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. తారు రోడ్డు నిర్మాణంతో రెండు జిల్లాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేద పండితుడికి ప్రశంస పత్రాలను అందజేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని, హైందవ సంస్కృతిలోని వేదాలను ప్రపంచంలోని పలు దేశాలు ఆచరిస్తున్నాయని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో అఖిల భారత వేద శాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సులో భాగంగా నిర్వహించిన చతుర్వేద స్మార్త పరీక్షల్లో ఉత్తీర్ణులైన వేదపండిత విద్యార్థులకు ఆదివారం పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా వేద పండిత విద్యార్థులకు నిర్వహించే చతుర్వేద స్మార్త పరీక్షలు వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించడం గర్వకారణమని, అభినందనీయమని కొనియాడారు. హైందవ సంస్కృతిలోని వేదాలను ఇతర దేశాల వారు ఆచరిస్తున్నారని, దేవాలయాలకు రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోందని అన్నారు. రానున్న రోజుల్లో వేద పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య మరింతగా పెరగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం వేద పండితులకు ఎల్లప్పు డు అండగా ఉంటుందని గుర్తు చేశారు. మన పూర్వీకులు తాలపత్ర గ్రంథాల ద్వారా వేదాలను మనకు అందించారని వివరించారు. గతంలో వేములవాడ రాజన్న ఆలయ చైర్మన్‌గా అనేక అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. రాజన్న ఆలయ విస్తరణ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నాని, నాలుగుసార్లు శృంగేరి వెళ్లి ఆలయ అభివృద్ధి విస్తరణ పనులపై పీఠాధిపతులతో చర్చించి ముందుకు వెళుతున్నామన్నారు. రూ. 47 కోట్లతో రోడ్డు వెడల్పు, రూ. 35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రూ. 150 కోట్లు రాజన్న ఆలయ అభివృద్ధికి కేటాయించడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. రోడ్డు వెడల్పులో నిర్వాసితుల త్యాగం ఎప్పటికి మరువలేనిదన్నారు. భూ నిర్వాసితుల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆలోచనలు చేస్తోందని తెలిపారు. వేద పండితులుగా పట్టాలు పొందుతున్న వేద విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పరీక్షాధికారులుగా వ్యవహరించిన వేద పండితులను ఘనంగా సన్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాభాయి ఏఈవోలు, సూపరిండెంట్‌లు తదితరులు ఉన్నారు.

- కంచు షార్ట్ ఫిలింకు ఆరు సీఐఎఫ్ఏ అవార్డులు
- దర్శకత్వంలో రాణిస్తున్న సంతోష్ నారాయణన్



బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ నుంచి.. సినీ దర్శకుడి వరకు



కెమెరాతో సంతోష్ నారాయణన్

వేములవాడ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సినిమాలపై ఉన్న మక్కువతో ఓ యువకుడు షార్ట్‌ఫిలింస్, వెబ్‌సీరిస్‌లు రూపొందిస్తూ తన ప్రతిభను చాటుకుంటున్నాడు. పలు అవార్డులను కైవసం చేసుకున్నాడు. వెండితెరపై తన పేరును చూసుకోవాలని ఆరాటంతో మొదలైన అతడి ప్రయాణం విజయ పథంలో సాగిపోతున్నాడు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ గ్రామీణ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సంతోష్ నారాయణన్..

వరంగల్ జిల్లాకు చెందిన నారాయణ-చీరమ్మ దంపతుల పెద్ద కుమారుడు సంతోష్ నారాయణన్ చిన్న తనం నుంచి సినిమాలు చూస్తూ వాటిపైన ఎంతో మక్కువను పెంచుకున్నాడు. చిన్నప్పటి నుంచి చదువులో టాపర్‌గా నిలిచిన నారాయణ్ సినిమాలపై ఉన్న ఆసక్తితో 2017వ సంవత్సరంలో అవకాశాల కోసం అన్వేషణ ప్రారంభించాడు. 'కనబడుటలేదు' 'ఆచూకీ' చిత్రాల డైరెక్టర్ బాలరాజు వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా అవకాశం వచ్చింది. రెండు సంవత్సరాల పాటు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూనే షూటింగ్‌లు లేని సమయంలో బ్యాంకు ఎగ్జామ్స్‌కు చదువుతూ ఒకేసారి 5 సెంట్రల్ గవర్నమెంట్ జాబ్స్ వచ్చాయి. సినిమాలపై ఉన్న ఆసక్తితో ప్రభుత్వ ఉద్యోగాలను వదులుకుని సినిమాల వైపే మొగ్గు చూపాడు. అయితే 2020ల ఎదురైన ఆర్థిక ఇబ్బందులతో బ్యాంకు ఉద్యోగంలో చేరాడు.

● 'కంచు'తో అవార్డుల పంట పండింది..

సంతోష్ నారాయణన్ సమాజంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా వెబ్‌సిరీస్ 'కంచు' తీశాడు. మహిళా సాధికారతకు సంబంధించిన కథనం కావడంతో ప్రేక్షకులకు చేరువైంది. ఈ వెబ్ సిరీస్‌కు కొచ్చిన్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ అవార్డులు ఆరింటిని కైవసం చేసుకుంది. అంతే కాకుండా లండన్ లిఫ్ట్ ఆఫ్ సెషన్ అవార్డు, బ్రిటన్ ఫస్ట్ టైమ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డు, 2021 సంవత్సరం ముంబైలో నిర్వహించిన ఎన్ఏడబ్ల్యూఏడీఏ ఇంటర్ నేషనల్ ఫిల్మ్ అవార్డుల్లో చోటు దక్కించుకుంది. ప్రస్తుతం మూడు వెబ్ సిరీస్‌లు, రెండు సినిమాలకు డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు.



నటులకు సూచనలు ఇస్తున్న సంతోష్ నారాయణన్

● న్యూస్‌బాక్స్

కుట్టు మిషన్ అందజేత

రామడుగు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలో వన్నారం గ్రామానికి చెందిన నిరుపేద ఒంటరి మహిళ గజ్జల లక్ష్మికి హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి చింతల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌ను ఉచితంగా ఆదివారం అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుదగోని రాజు, మాజీ ఉపసర్పంచ్ గుంట ఓంప్రకాశ్, చిట్కూరు శ్రీనివాస్, పెంటి రాజమౌళి, గజ్జెల అంజయ్య, గుంట అజయ్, వేములవాడ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత పంపిణీ

చిగురుమామిడి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో హుజూరాబాద్ త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ భగవద్గీతను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురు పౌర్ణమి రోజు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సభ్యులు సతీష్‌చారి, గోపికృష్ణ, శ్రావణ్, సిద్దార్థ్, రామస్వామి, పద్మ, జ్యోతి, సరిత, ప్రియాంక, శ్రీదేవి, నక్షత్ర, నరేష్ పాల్గొన్నారు.

మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటరీ అసోసియేషన్

కరీంనగర్ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా నార్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రామిడి శ్రీనివాస్, కోశాధికారిగా ముప్ప చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం వార్షిక సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి రామిడి శ్రీనివాస్ మాట్లాడుతూ పెట్టుబడి దారులకు భవిష్యత్‌లో మ్యూచువల్ ఫండ్స్ ద్వారా సంపద పెంచడంలో నమ్మకమైన వ్యక్తులమన్నారు.

దళితుల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ కృషి

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి
- బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆరెపల్లి మోహన్

కరీంనగర్ అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ దళితుల అభ్యున్నతికి కృషి చేశారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో సివిల్ హాస్పిటల్ చౌరస్తాలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, వెన్న రాజమల్లయ్య, కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బానోతు శ్రావణ్ నాయక్, బొబ్బిలి విక్టర్, కల్వల రాంచందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, వంగల విద్యాసాగర్, దండి రవీందర్, రమేష్, అబ్దుల్ భారీ, నెల్లి నరేష్, మాదాసు శ్రీనివాస్, మంద మహేష్, బషీర్ ఉద్దీన్, అనిల్‌కుమార్, నీరజ పాల్గొన్నారు.

మానకొండూర్: భారత మాజీ ఉపప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ ఆశయ సాధన కోసం ప్రతీఒక్కరు కృషిచేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరెపల్లి మోహన్ పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచు బొల్లం వెంకట్‌స్వామి, రొడ్డ యాదగిరి, ఆర్‌ఐ రాములు, సయ్యద్ హమీద్‌అలీ, సయ్యద్ సిరాజోద్దీన్, రొడ్డ అంజయ్య, మడుపు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సుజనాదేవికి కథల పోటీల్లో బహుమతులు

కరీంనగర్ కల్చరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్న రచయిత్రి నామని సుజనాదేవి పలు కథల పోటీల్లో బహుమతులు సాధించారు. ముల్కనూరు సాహితీ పీఠం వారు నిర్వహించిన పోటీల్లో 'క(ఖ)ర్మ యోగి' కథకు తృతీయ బహుమతి, కెనడా తెలుగు తల్లి వారు జరిపిన కెనడా డే పోటీల్లో 'మాటే మంత్రం' కథకు బహుమతి, విశాఖ సంస్కృతి వారి శేషేంద్రశర్మ రచనల్లో 'కవి వాక్యానికి కథ' శీర్షిక కింద నిర్వహించిన పోటీలో 'వివర్ణమైన వర్ణాలు' కథకు బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు రచయితలు, రచయిత్రిలు అభినందనలు తెలిపారు.

వ్యర్థాలతో వెదజల్లుతున్న దుర్వాసన


అన్నారం నాగుల చెరువు మత్తడిలో వేసిన వ్యర్థాలు

మానకొండూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామంలో నాగుల చెరువు మత్తడిలో పడేసిన వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామస్థులతోపాటు గ్రామంలోని చికెన్, మటన్ సెంటర్ల నిర్వాహకులు కోళ్లు, మేకలు, గొర్రెల వ్యర్థాలను మత్తడితోపాటు చెరువు కట్టకు ఇరువైపులా వేస్తున్నారు. గ్రామానికి చెందిన రైతులు, రైతు కూలీలతోపాటు రంగపేట, వెల్ది గ్రామస్థులు నిత్యం దారివెంట రాకపోకలు సాగిస్తారు. చెరువుకట్ట మొదలు నుంచి చివరి వరకు వ్యర్థాల దుర్వాసన భరించలేక పోతున్నామని గ్రామస్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. అంతేకాకుండా చెరువుకట్టకు ఇరువైపులా పడేసిన మటన్, చికెన్ ముక్కలను కుక్కలు తిని దారి వెంట వెళ్తున్న వారిపై దాడులకు పాల్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పనులు ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

కరీంనగర్ అర్బన్/కరీంనగర్ రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్ శివారు 1వ డివిజన్ అరెపెల్లిలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. 1వ డివిజన్ ఇన్‌చార్జి వేణు అభ్యర్థన మేరకు ఎస్‌డీఎఫ్ నిధులు 20లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ప్రతీ డివిజన్‌లో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు పురమల్ల శ్రీనివాస్, పార్టీ1వ డివిజన్ ఇన్‌చార్జి ఎట్టెపు వేణు, హెచ్ తిరుపతి రెడ్డి, వెంకటరెడ్డి, బుర్ర గౌరయ్య, బత్తిని అనిల్, శ్రీకాంత్, అనికేత్, సత్తినేని రాజయ్య, తిరుపతి, బలమల్లు, సాగర్, మురళి పాల్గొన్నారు.

కఫిసా ఆడిటోరియానికి స్థలం కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ ఫిలిం సొసైటీ ఆడిటోరియం నిర్మాణానికి స్థలం కేటాయించాలని అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర కోరారు. ఆదివారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట కార్యవర్గ సభ్యుడు అన్నవరం దేవేందర్, సీనియర్ జర్నలిస్ట్ పీఎస్ రవీంద్ర ఉన్నారు.

హనుమాన్ చాలీసా పఠన పోటీలు

కరీంనగర్ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తొలి ఏకాదశి సందర్భంగా రాంనగర్, అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పఠన పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు సౌజన్య ప్రదాత, 16వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ఇలాంటి ధార్మిక, ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగించే కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అండగా ఉండి, సహాయ సహకారాలందిస్తానని అన్నారు. అన్నాడి గజేందర్‌రెడ్డి, రాజారాం మోహన్‌శర్మ, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్, నిర్వాహకుడు, సీనియర్ వీహెచ్‌పీ కార్యకర్త బొమ్మకంటి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కరీంనగర్ రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆషాడ మాస శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నగునూరులోని దుర్గాభవానీ ఆలయంలో ఆదివారం అమ్మవారిని కంకులు, నిమ్మకాయలతో అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఒడిబియ్యం, చీరసారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో వనమహోత్సవం

కరీంనగర్ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప దేవాలయంలో తొలి ఏకాదశి, వనమహోత్సవంలో భాగంగా ఆదివారం మొక్కలు నాటారు. ఆలయ చైర్మన్ అనిల్ కుమార్, ఈవో కాంతారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు సత్యనారాయణ, ఆనందరెడ్డి, కవిత, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించాలని వినతి

కరీంనగర్ అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ప్రస్తుత 32వ డివిజన్‌లో నిలిచిన రోడ్ల నిర్మాణ పనులు, అమృత్ స్కీంలో భాగంగా పైప్‌లైన్ పనులకు నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య కోరారు. ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేస్తూ వినతి పత్రంపై ఎండార్స్ చేసినట్లు భూమయ్య తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పడిశెట్టి భూమయ్య కృతజ్ఞతలు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే పత్తిలో దిగుబడి


తీగలగుట్టపల్లిలో సాగు చేసిన పత్తి పంట

కరీంనగర్ రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులతో పత్తిసాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అంతర పంటలు వేస్తే అదనపు ఆదాయం పొందవచ్చని పేర్కొంటున్నారు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో తొలకరి జల్లులకే రైతులు పత్తి సాగుకు సిద్ధమయ్యారు. సాధారణ వర్షపాతం కూడా నమోదు కాక పోవడంతో కొంత మంది రైతులు సాగు చేయగా మరి కొందరు వర్షాల కోసం ఎదురు చూశారు. ప్రస్తుతం వర్షాలు మొదలవడంతో పత్తి విత్తుకోవచ్చు. కీలక దశల్లో నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పంట సాగు చేసే ప్రాంతాల్లో 60 మిల్లీమీటర్లకుపైగా వర్షం కురిసిన తర్వాతే భూమిలో విత్తనం వేయాలి. నేల స్వభావం నీటి సౌకర్యం దృష్ట్యా సరైన రకాలు ఎంపిక చేసుకోవాలి. చేను చుట్టూ ఎర పంటలు విత్తాలి. కందిని అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. ఎరువులు భూమిలోపల మొక్కకు దగ్గరగా పడేటట్లు గొర్రు లేదా చేతితో వేయాలి. కాంప్లెక్స్ ఎరువులను ఎట్టి పరిస్థితుల్లోనూ పైపాటుగా వేయొద్దు. నత్రజని, పొటాష్‌ను మాత్రమే అలా వేయాలి. పురుగు మందులు అధికంగా వాడొద్దు. దేనికి ఎంత మోతాదు అవసరమో వ్యవసాయ శాఖ అధికారుల సచనల మేరకు వినియోగించాలి. ఎక్కువగా గులాబీ రంగు పురుగు ఉధృతి గమనించేందుకు, రెక్కల పురుగు నియంత్రణకు చేనులో లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలి. పత్తి తరువాత జనవరిలో పప్పు ధాన్యపు పంటలు వేసుకుంటే దిగుబడి వస్తుందని, భూసారం మెరుగు పడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. విత్తన శుద్ధి చేయకుండా భూమిలో విత్తకూడదు. నాణ్యత, అనుమతి లేని విత్తనాల జోలికి పోవద్దు. ప్రధానంగా ఇసుక నేలలు, మరీ తేలికపాటి చల్క భూములు తేమను నిల్వ చేయవు. ఈ భూముల్లో పత్తి సాగు చేసుకోకుంటే మంచిది. పంటకు గులాబీ రంగు పురుగు ఆశిస్తే పత్తిని ఇళ్లలోగానీ, జిన్నింగ్ మిల్లుల వద్దగానీ నిలువ చేయవద్దు. పంట కాలాన్ని ఏడు నెలలకు మించి పొడిగించకూడదు. రైతులు అవసరమైన సస్యరక్షణ చర్యలు తీసుకుంటూ పంట సాగు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

కృషి యూత్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు

భగత్‌నగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కృషి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, (ఐవైఎస్ఓ) ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఆదివారం రేకుర్తిలోని ప్రైవేటే మార్కెటింగ్ బిజినెస్ శిక్షణ తీసుకునే వారితో పాటు ఉద్యోగులకు 56 మందికి ఉచితంగా రక్త పరీక్షలు చేసి బ్లడ్ గ్రూపులను చెప్పారు. కృషి యూత్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ వర్షాకాల సీజన్‌లో వ్యాధులు రాకుండా, మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలు విజృంభించకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

బావుపేట రోడ్డుపై తాత్కాలిక డ్రైనేజీ నిర్మాణం


పనులను పరిశీలిస్తున్న స్థానికులు

భగత్‌నగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-సిరిసిల్ల రహదారి బావుపేట వద్ద కలెక్టర్ ఆదేశాలతో ఆదివారం తాత్కాలిక డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. సిరిసిల్ల-కరీంనగర్‌ప్రధాన రహదారిపై డ్రైనేజీ నీరంతా రోడ్డుపై ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్ పమేలా సత్పతి శాశ్వత పరిష్కారం కోసం రూ.90 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని త్వరలో నిర్మాణం చేపడుతామని అన్నారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా నాలా ఏర్పాటు చేసి నిల్వ ఉన్న నీటిని పంపించేందుకు కచ్చా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని రోడ్లు భవనాల శాఖ డీఈ, ఎంపీడీవోలను ఆదేశించడంతో వెంటనే అధికారులు తాత్కాలిక డ్రైనేజీని నిర్మించారు. దీంతో వరదనీటితోపాటు, డ్రైనేజీ నీరు రోడ్డుపై చేరకుండా చర్యలు చేపట్టినట్లయ్యింది.

ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి


కరీంనగర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పశ్చిమ జోన్ ఆధ్వర్యంలోవిద్యానగర్‌లోని బీజేపీ జెండా గద్దె వద్ద శక్తి కేంద్రం ఇన్‌చార్జి నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

● నగరంలోని 17వ డివిజన్, విద్యానగర్ వీధిలో బీజేవైఎం కార్యదర్శి ఉదారపు విద్యాసాగర్ ఆధ్వర్యంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి, పోలోజు ప్రకాష్, కాల్వ పూర్ణచందర్ రెడ్డి, దయ్యాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ పార్టీ పట్టణాధ్యక్షుడు తూర్పాటి రాజు ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో గంగిశెట్టి ప్రభాకర్, బొరగాల సారయ్య, కొలిపాక వెంకటేష్, శశిధర్, రాజు, వాసు, రమేష్, నాగరాజు, వీరస్వామి, సంపత్, కొండాల్‌రెడ్డి, చత్తర్‌సింగ్, అపర్ణ, శివకృష్ణ, రవీందర్, నగేష్, రాము, అనిల్, సునీల్, విజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నాయకులు జైపాల్, నరేందర్, అశోక్, సాగర్, శ్రీనివాస్, సారయ్య రాజు, సాయిప్రకాష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట : ఇల్లందకుంట మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో నాయకులు పాపిరెడ్డి, విజయ్‌బాబు, లింగారెడ్డి, రమేష్, సమ్మయ్య, శ్రీనివాస్, మురళీ, భరత్, వీరస్వామి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో ఆందోళన


ఆందోళన చేస్తున్న మహిళలు

చిగురుమామిడి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముల్కనూర్‌లోని నాలుగో వార్డు మహిళలు ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మూడు నెలల నుంచి తాగునీరు రావడం లేదన్నారు. ఈ విషయాన్ని గ్రామ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి సమస్యను తీర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు మహిళలు పాల్గొన్నారు.

'స్థానిక' సందడి

(5వ పేజీ తరువాయి)

దీంతో పార్టీ టికెట్ల కేటాయింపులో ఈసారి తీవ్ర పోటీ ఉంటుందని భావిస్తుండడంతో అప్పుడే ఐఔత్సాహికులు నేతల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించారు. డివిజన్‌లో ఆయా పార్టీల్లో పోటీ చేసేందుకు ఎవరు ఉత్సాహంగా ఉన్నారో ఆరా తీస్తున్నారు. కొన్ని డివిజన్లలో పోటీ ఎక్కువగా ఉంటుందని భావిస్తున్న నాయకులు వేరే పార్టీలో చేరడమా, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడమా అని ఆలోచిస్తున్నారు. టికెట్ తనకే వస్తుందని ఇప్పటికే నేతలు తమకు హామీ ఇచ్చి పని చేసుకోమ్మనన్నారని, డివిజన్ ప్రముఖులు, వాకర్స్, ఓటర్లను ప్రభావితం చేసే కాలనీ వెల్ఫేర్ సంఘాలు, అపార్ట్‌మెంట్ సంఘాలను కలుస్తూ ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో రోజురోజుకు డివిజన్లలో ఎన్నికల వేడి రాజుకుంటుంది.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

హుజూరాబాద్/జమ్మికుంట/సైదాపూర్/రామడుగు/చిగురుమామిడి జూలై 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్, జమ్మికుంట, సైదాపూర్, రామడుగు, చిగురుమామిడి మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

శంకరపట్నం/వీణవంక, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం, వీణవకం మండలాల్లో మొహర్రం కులమతాలకు అతీతంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లతో పీరీలను గ్రామాల్లో ఊరేగింపు చేశారు.

రామడుగు: మండలంలోని గుండి, రామడుగు, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో వందలాది మంది పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండం చుట్టూ తిరుగుతూ దివిటీలను వెలిగించారు. పీరీలను డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

మంత్రిని కలిసిన టీఎన్జీవో నాయకులు


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మంత్రి పొన్నం ప్రభాకర్‌ను టీఎన్‌జీవో రాష్ట్ర, జిల్లా నాయకులు ఆదివారం కలిశారు. తొలిఏకాదాశి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వసతి గృహ సంక్షేమశాఖ అధికారులకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మన్‌రావు, జిల్లా నాయకుడు మల్క రాజేశ్వరరావు, వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మచ్చేందర్, జిల్లా అధ్యక్షుడు బోనాల రవి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనానికి 'ముదుగంటి'కి ఆహ్వానం


డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, పలు పురస్కారాల గ్రహీత, రచయిత డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డికి ఈ నెల 11న త్యాగరాయగానసభలో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే కవి సమ్మేళనంలో పాల్గొనాల్సిందిగా ఆదివారం ఆహ్వానం అందింది. కవి ఎన్.రఘువీర్ ప్రతాప్ నేతృత్వం వహించే కవి సమ్మేళనంలో ముదుగంటి తన కవితను వినిపించనున్నారు.

మున్నూరు కాపు సంఘం కార్యవర్గం


కరీంనగర్ అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రాంనగర్, ప్రగతి నగర్, శివనగర్, మార్కండేయ నగర్ కలిపి 15వ డివిజన్ మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంద మల్లారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా పెంట సత్యనారాయణ, బల్లికొండ లింగన్న, మామిడి అంజన్న, ఉపాధ్యక్షులుగా మెల్ల శ్రీనివాస్, కొడారి శ్రీపాల్, ప్రధాన కార్యదర్శిగా కొత్త భరత్, జాయింట్ సెక్రెటరీ కనుకం ప్రశాంత్, కోశాధికారిగా సిద్దం కనుకయ్య, కార్యవర్గ సభ్యులుగా బొమ్మకంటి సుదర్శన్, కొట్టె సుధాకర్, మంద రాజేందర్, చింతపంటి వెంకన్న, హర్ని శ్రీనాథ్, వంగళ రాజయ్య, ఉప్పు ప్రభాకర్, గాండ్ల బాలయ్య ఎన్నికయ్యారు.

ఎస్సై, కానిస్టేబుల్ కుటుంబాలకు పరామర్శ


చెక్కు అందజేస్తున్న 2009 బ్యాచ్ అధికారులు

కరీంనగర్ క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గత నెల 26న ఉదయం విధి నిర్వహణలో ఉండగా రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆలమూరు ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సన్ జీవన్ కుటుంబాలను 2009 ఎస్సై బ్యాచ్‌కు చెందిన అధికారులు ఆదివారం పరామర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లాకు చెందిన అశోక్ స్వగ్రామం నర్సాపురంలోని ఆయన నివాసానికి వెళ్లి ఎస్సై వెల్ఫేర్ సొసైటీ ద్వారా రూ.26 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. కానిస్టేబుల్ జీవన్ స్వగ్రామం ఆలమూరుకు వెళ్లి ఆయన కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. 2020లో స్థాపించిన 2009 బ్యాచ్ వెల్ఫేర్ సొసైటీ అప్పటి నుంచి తమ బ్యాచ్‌కు చెందిన అవసరంలో ఉన్న కుటుంబాలకు ఇప్పటి వరకు రూ.2 కోట్లకుగాపై ఆర్థిక సహాయం అందించింది.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ


కరాటే బెల్టులు సాధించిన విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్ కరాటే అకాడమీ విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేశారు. ఈ గ్రేడ్ పరీక్షల్లో 85 మంది విద్యార్థులు పాల్గొనగా, కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోకాన్ ఇండియా ప్రతినిధి, హైదరాబాద్‌కు చెందిన గడియారం గణేష్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచినవారికి బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కోచ్ గౌరు రాజిరెడ్డి, కోచ్ డి మాలతి, జాతీయ కరాటే క్రీడాకారిణి ఎం సంజన, సీనియర్ బ్లాక్ బెల్ట్ విద్యార్థులు పాల్గొన్నారు.